సాక్షి కర్నూలు

బుధవారం । 10 । జనవరి । 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా శేషపూజలు నిర్వహించారు.



మహానందిలో భక్తజన సందడి

మహానంది: రెండు తెలుగు రాష్ట్రాల భక్తుల రాకతో మహానంది క్షేత్రం కిటకిటలాడింది. భక్తులు కోనేరుల్లో స్నానాలాచరించి, కామేశ్వరి దేవి, మహానందీశ్వరులను దర్శించుకున్నారు.



ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పల్లా రవీంద్రబాబు మంగళవారం రూ.5 లక్షలు విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

విధుల్లోకి 220 మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

కర్నూలు(అర్బన్): సమస్యల సాధనకు గత 27 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పలువురు ప్రభుత్వ అభ్యర్థన మేరకు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విధుల్లోకి చేరినట్లు ఐసీడీఎస్ వర్గాలు తెలిపాయి. ఈనెల 6వ తేదీన జిల్లాలో మొత్తం 1,841 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 1,790 మంది హెల్పర్లు సమ్మెలో ఉన్నారు. సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు మొత్తం 112 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 108 మంది హెల్పర్లు విధుల్లోకి చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

11 నుంచి ఆర్‌యూకు సంక్రాంతి సెలవులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలకు ఈనెల 11 నుంచి సక్రాంతి పర్వదిన సెలవులు ఇస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవులు 18వ తేదీ వరకు ఉంటాయని, 19న వర్సిటీ పునఃప్రారంభమవుతుందని తెలిపారు.

యువజనోత్సవాల్లో జిల్లాకు ప్రథమ స్థానం



జ్యోతి

కర్నూలు (హాస్పిటల్): యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9 వరకు గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో జిల్లాకు మొదటి స్థానం లభించింది. జానపద గీతం అంశంలో సిల్వర్ జూబ్లీ కళాశాల బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని జ్యోతి మొదటి స్థానంలో నిలిచింది. ఈమె ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరగబోయే జాతీయ యువజనోత్సవాల స్థాయి పోటీలకు అర్హత సాధించింది. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన ఈమె తల్లిదండ్రులు ఇ.ప్రసాద్, ఇ.ప్రమీల వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు.

11న వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 11న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో భాగంగా అండర్-19 వాలీబాల్ జట్టు ఎంపిక పోటీ లు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికై న జట్టు చెన్నైలో జరగనున్న సౌత్‌జోన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆధార్‌కార్డు, పదవ తరగతి ధృవపత్రం, జనన ధ్రువీకరణ పత్రం, సంబంధిత స్కూల్ బోనోఫైడ్ పత్రం తీసుకురావాలన్నారు.

మార్కెటింగ్ శాఖలో పదోన్నతులు

- నేడు పదోన్నతులపై కౌన్సెలింగ్

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖలో పలువురికి పదోన్నతులు లభించనున్నాయి. అసిస్టెంట్ సెక్రటరీ నుంచి గ్రేడ్-3 సెక్రటరీలుగా, గ్రేడ్-3 సెక్రటరీల నుంచి గ్రేడ్-2 సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించనున్నారు. బుధవారం గుంటూరులోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌లో పదోన్నతులను ఖరారు చేయనున్నారు. మాధవ కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డిలకు గ్రేడ్-3 సెక్రటరీ నుంచి గ్రేడ్-2 సెక్రటరీలుగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. సుందర్‌రాజు, ఎం.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రహిమాన్, కార్నలీస్, శాంతకుమార్‌లకు అసిస్టెంట్ సెక్రటరీ నుంచి గ్రేడ్-3 సెక్రటరీలుగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులపై బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. బుధవారం జోనల్ స్థాయిలో పదోన్నతులు ఖరారు కానున్నాయని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 1,707 మంది విద్యార్థులు గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడు, ఒకటవ సెమిస్టర్ పరీక్షలకు మంగళవారం 1,707 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో మూడవ సెమిస్టర్ పరీక్షకు 10,232 మందికి గాను 9,347 మంది హాజరు కాగా 885 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షకు 5,599 మందికి 4,777 మంది హాజరు కాగా 822 మంది గైర్హాజరయ్యారన్నారు. చూచిరాతలకు పా ల్పడుతూ కర్నూలు వాసవీ మహిళా కళాశాల లో ఇద్దరు, బనగానపల్లె శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఇద్దరు, డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బేతంచెర్ల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు, డోన్ వైష్ణవి, పత్తికొండ విజయ సాయి , ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 12 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

కదిలే సంజీవని

ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు పావు గంటలో అత్యవసర సేవల వాహనం అందుబాటులోకి వస్తుంది. ఆపదలో ఉన్న వారికి ఆయువు పోస్తుంది. వస్తూనే రోగికి ప్రాథమిక చికిత్స చేస్తూనే ఆసుపత్రికి తరలించి ప్రాణం కాపాడుతోంది. ఇంతటి అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్న అంబులెన్స్ వాహనాలు జిల్లాలో ప్రతి మండలంలో ఏర్పాటయ్యాయి. ఏటా లక్ష మందిని ఆసుపత్రులకు తీసుకెళ్తూ ఆపదలో అండగా నిలుస్తున్నాయి.

– కర్నూలు(హాస్పిటల్)



- 108 సేవలకు అత్యాధునిక సొబగులు
- ప్రతి మండలానికో వాహనం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 57 వాహనాలు
- వాహనాల్లో అత్యాధునిక వైద్యపరికరాలు, సేవలు
- 2020 జులై నుంచి 3,50,719 మందికి సేవలు
- ఏటా లక్ష మంది వాహనం ద్వారా ఆసుపత్రులకు

జిల్లాలో 2005 సంవత్సరంలో 108 అంబులెన్స్ సేవలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. మొదట్లో కర్నూలు, ఆదోని, నంద్యాల, శ్రీశైలానికి ఒక్కో వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం 2006లో మరో 28 వాహనాలు వీటికి జతచేరాయి. అన్ని రకాల ప్రమాదాలు, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లడం, గుండెపోటు, మూర్ఛవ్యాధి, ఇతర అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో రోగిని ఆసుపత్రికి తరలించడం వంటి సేవలను ఈ వాహనాలు నిర్వర్తించాయి. ఈ సేవలను ఇతర రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలూ మెచ్చుకుని అక్కడా అమలు చేశాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించాక వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశాయి. వాహనాలు పెంచకపోవడమే గాక ఉన్న వాహనాలకూ మరమ్మతులు చేయించకుండా మూలన పడేశారు. ఉద్యోగులకు సైతం జీతభత్యాలు సరిగ్గా ఇచ్చేవారు కాదు. 2019లో వైఎస్ఆర్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2020 జులై నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రతి మండలానికి ఒక వాహనం చొప్పున మొత్తం 57 వాహనాలు కేటాయించారు. వీటి ద్వారా కేవలం రోడ్డు ప్రమాదాలు, అత్యవసర మెడికల్ సర్వీసులకు, గర్భిణులకు ఆసుపత్రులకు తరలించడమే కాదు గర్భిణులకు ప్రతినెలా 9న వైద్యపరీక్షలకు వెళ్లడం, డయాలసిస్ రోగులను, క్యాన్సర్ రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లడం వంటి సేవలు అందిస్తున్నాయి. ఇందులో చిన్నారుల ప్రాణాలను రక్షించేందుకు గాను ఆదోని, నంద్యాలలో అత్యాధునిక నియోనేటల్ వాహనాలు కూడా అందిస్తున్నాయి. 2020 జులై నుంచి ఇప్పటి వరకు 3,50,712 మందికి 108 వాహనాల ద్వారా సేవలు అందించారు. యేటా లక్ష మందిని పైగా అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తరలిస్తున్నారు.

అంబులెన్స్ ప్రత్యేకతలు

- ఆదోని, నంద్యాలలకు ఒక్కొక్కటి చొప్పున నియోనేటల్ అంబులెన్స్‌లు
- 108 వాహనాల్లో 13 అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్ఎస్),42బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్) వాహనాలు
- నడిచే ఐసీయూ తరహాలో ఏఎల్ఎస్ సౌకర్యం ఉన్న వాహనంలో వెంటిలేటర్, డీఫిబ్రిలేటర్, ఇన్‌ఫ్యూజన్ పంప్స్, సిరంజి పంప్స్ ఏర్పాటు
- ప్రతి అంబులెన్స్‌లో ఆక్సీజన్, సక్షన్ ఆపరేటర్స్, మల్టీ పారా మానిటర్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయి.
- ప్రతి వాహనంలో నియోనేటల్ వార్మింగ్ బ్లాంకెట్స్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 108 అంబులెన్స్ సేవలు

సంవత్సరం	సేవలు అందుకున్న వారి సంఖ్య
2020(జులై నుంచి డిసెంబర్ వరకు)	27,593
2021	1,18,891
2022	90,954
2023	1,13,281



అంబులెన్స్‌లోని అత్యాధునిక వైద్యపరికరాలు

108లోనే ప్రసవం



నా వయస్సు 30 ఏళ్లు. నేను పురిటినొప్పుల వల్ల 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాను. 5 నిమిషాల్లో అంబులెన్స్ మా వద్దకు వచ్చి వైద్యసేవలు ప్రారంభించారు. నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌లోనే నాకు ప్రసవం చేసి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చే అవకాశం కల్పించారు. ఆపదలో మమ్మల్ని ఆదుకున్న 108 అంబులెన్స్ వారికి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– శాంతకుమారి, ఓర్వకల్లు

సకాలంలో సేవలు



నాకు ఇటీవల అకస్మాత్తుగా కడుపునొప్పి రావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాను. గడివేముల అంబులెన్స్ వారు సకాలంలో వచ్చి అంబులెన్స్‌లోనే వైద్యం చేశారు. ఆ తర్వాత ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు నాకు మెరుగైన వైద్యం అందించడంతో కోలుకున్నాను. సకాలంలో నాకు వైద్యసేవలు అందించిన 108 అంబులెన్స్‌కు కృతజ్ఞతలు.

– నాగేంద్ర, ఒండుట్ల గ్రామం, గడివేముల

అత్యవసరానికి ఉపయోగించుకోండి



ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ ఏర్పాటు చేశాం. ఇంకా చాలా మంది వైద్య సేవల కోసం ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రసవాలకు, గర్భిణులకు వైద్యపరీక్షలకు సైతం ఆటోల్లో వెళ్తున్నారు. వైద్యపరీక్షలకు సైతం 108 వాహనాలలో వెళ్లవచ్చు. అత్యవసర వైద్యం ఏదైనా 108 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. డయాలసిస్ రోగులు, క్యాన్సర్ రోగులు సైతం వైద్యచికిత్సల కోసం ఈ వాహనాల్లో వెళ్లవచ్చు.– ఎం.నవీన్ కుమార్, అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్(108అంబులెన్స్), డిస్ట్రిక్ట్ మేనేజర్, కర్నూలు

సుస్థిర లక్ష్యాల సాధనకు ప్రణాళికలు



మాట్లాడుతున్న డీపీఓ టి.నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలను రూపొందించుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు సూచించారు. పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎంపీడీఓ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25కు సంబంధించి రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో మంగళవారం ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమాలకు డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, కర్నూలు డీఎల్‌పీఓ తిమ్మక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం 243 జీ ప్రకారం స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చిన అధికారాలకు అనుగుణంగా లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిలను తయారు చేసుకొని అమలు పరచాల్సి ఉందన్నారు. ఇందులో పంచాయతీరాజ్ సంస్థల పాత్ర కీలకమన్నారు. ఈ ప్రక్రియ 'ప్రజా ప్రణాళిక ఉద్యమం' పేరుతో 2017 నుంచి జరుగుతున్నదన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి తొమ్మిది థీముల్లో ఒక థీమ్‌ను ఎంపిక చేసుకొని ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ఏపీ పీఆర్ చట్టం 1994 జీఓఎంఎస్ నెంబర్: 18, 19ను అనుసరించి జిల్లా, మండల, గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరుల కేటాయింపు, జీఓఎంఎస్ నెంబర్: 20 ద్వారా 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి టైడ్ గ్రాంట్ 60 శాతం నిధుల్లో 30 శాతం తాగునీటికి, 30 శాతం పారిశుధ్యానికి, అన్‌టైడ్ 40 శాతం నిధుల్లో ఎంపిక చేసుకున్న థీమ్‌కు 25 శాతం కేటాయించాలన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీ 2024–25 ప్రణాళికలను ఇ– గ్రామ్ స్వరాజ్ ' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ జేమ్స్ కృపావరం తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

- కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భగేల్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ భగేల్

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భగేల్ సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను సందర్శించారు. క్యాజువాలిటీలో రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాల వల్ల 10 కోట్ల మందికి పైగా భారతీయులు దారిద్ర్య రేఖ నుంచి ఎగువకు వచ్చారన్నారు. మరుగుదొడ్లు కట్టించి ప్రతి స్త్రీ ఆత్మగౌరవాన్ని కాపాడినట్లు చెప్పారు. ఆయుష్మాన్ కార్డులు, ఉచిత బియ్యం, సిలిండర్లు, కిసాన్ సమ్మాన్ నిధి, పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలను పేదలకు మోదీ ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1.51 కోట్ల ఆయుష్మాన్ కార్డులు అందజేయగా, కర్నూలు జిల్లాలో 3.96 లక్షల కార్డులు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం కోసం 160 హాస్పిటల్‌లు ఎన్‌ప్యానెల్ చేసినట్లు చెప్పారు. ఆయన వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాధారణ టికెట్ ధరతోనే ప్రత్యేక బస్సులు

- టీడీపీ హయాంలో ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనంగా వసూలు
- నేటి నుంచి సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు

కర్నూలు సిటీ: జిల్లావాసులు వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు, పనుల నిమిత్తం పక్క రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లిన వారు పండుగల సందర్భంగా జిల్లాకు వస్తుంటారు. అయితే ఇలాంటి సమయంలో తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పండుగల పేరుతో ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సులకు సాధారణ టికెట్ ధరలో 50 శాతం అదనంగా వసూలు చేశారు. దీని వల్ల చాలా మంది చార్జీలు భారమై పండుగలకు సైతం రాలేని పరిస్థితి. అయితే రాష్ట్రంలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ అదనపు భారాన్ని ప్రజలపై పడకుండా చర్యలు తీసుకుంది. ఏపీఎస్‌ఆర్‌టీసీ ప్రభుత్వంలో విలీనం అయినప్పటి నుంచి పండుగ రోజుల్లోను సాధారణ టికెట్ ధరలకే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకునేందుకు, తిరుగు ప్రయాణాల కోసం నేటి నుంచి ప్రత్యేక బస్సులు తిప్పనున్నారు. రెగ్యులర్ బస్సులతో పాటు అదనంగా ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రత్యేక సర్వీసులకు రాను, పోను రిజర్వేషన్ సౌకర్యం, ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న వారికి చార్జీల్లో 10 శాతం రాయితీ కల్పిస్తున్నారు.

సంక్షేమ పాలనకు 'ప్రజా సంకల్పం' పునాది

- ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసిన పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు
- వైఎస్ఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు



కేక్ కట్ చేస్తున్న బీవై రామయ్య తదితరులు



పత్తికొండలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తదితరులు

కర్నూలు (టౌన్): ప్రస్తుత సంక్షేమ పాలనకు ప్రజా సంకల్ప పాదయాత్ర పునాది అని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తై ఐదేళ్లయిన సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించుకున్నారు. కర్నూలులోని పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. జై జగన్ నినాదాలు చేశారు. కేక్ కట్ చేశారు. వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ అధ్యక్షులు బీవై రామయ్యతో పాటు కర్నూలు నియోజకవర్గ నాయకులు, పార్టీ నాయకులు పాల్గొని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆదోనిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఎస్కేడీ కాలనీ నుంచి గోషా ఏరియా ఆసుపత్రి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పత్తికొండలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కోడుమూరు కొత్త బస్టాండ్ వద్ద జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని నేతలు కోరారు.

ఎన్నికల సన్నద్ధతపై నివేదిక



విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): వచ్చే ర్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం విజయవాడలో నిర్వహించిన ఎన్నికల సన్నద్ధత కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల నిర్వహణ కోసం చేసిన ముందస్తు ఏర్పాట్లపై నివేదిక సమర్పించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక కల్పన, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై తీసుకున్న చర్యలపై నివేదించినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, భద్రత ఇతర అంశాలపై ఎస్పీ వివరించారన్నారు.

నేడు: ఆధునికీకరణ పనులతో కొత్త రూపు సంతరించుకున్న ఎల్లెల్సీ





నాడు: హొళగుంద సెక్షన్ 184 కి.మీ వద్ద అధ్వానంగా ఉన్న దిగువు కాలువ(ఎల్లెల్సీ)

నాడు వెలవెల.. నేడు కళకళ

నాడు టీడీపీ పాలనలో ఎలాంటి మరమ్మతులకు నోచుకోక తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధునికీకరణ పనులతో దిగువ కాలువ రూపే మారిపోయింది. 1955లో నిర్మించిన ఈ కాలువకు అప్పుడప్పుడు మరమ్మతులు, ఇతర పనులు తప్ప ఎలాంటి శాశ్వత పనులు జరగకపోవడంతో తరచూ సమస్యలు ఎదురయ్యేవి. ఎల్లెల్సీ టీబీ బోర్డు పరిధిలో ఉన్న 115 కి.మీ నుంచి 205 కి.మీ వరకు రూ.వందల కోట్ల నిధులతో జరిగిన ఆధునికీకరణ పనులతో జలచౌర్యం, అక్రమ నానాయకట్టు సాగు సాధ్యమైనంత మేర తగ్గడంతో పాటు నీటి వృథా, గండీల ముప్పు పూర్తిగా తగ్గాయి. జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల వరదాయిని అయిన ఎల్లెల్సీ ఈ ఆధునికీకరణ పనులతో ఆంధ్రా కోటా నీరు పూర్తిగా రైతులను ఆదుకుంటోంది. ఎల్లెల్సీ కింద కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 43 వేలు, రబీలో 1.7 లక్షల ఎకరాలు కలిపి మొత్తం 1,57,062 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు, 139 గ్రామాలకు తాగు నీరు అందుతోంది.

– హొళగుంద

క్లుప్తంగా

గోమాతకు సీమంతం



గోమాతకు సీమంతం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో ఓ స్థానికురాలు గోమాతకు సీమంతం చేశారు. మద్దిలేటమ్మ, రాముడు దంపతులకు ఇద్దరు కుమారులు. తన తండ్రి ఇచ్చిన గోవుకు సీమంతం చేసి కూతురు లేని లోటును తీర్చుకునాన్నని మద్దిలేటమ్మ చెబుతోంది. పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించి పిండి వంటలు, చీర, సారె గోవుకు సమర్పించి హారతులు ఇచ్చారు. అనంతరం కాలనీ వాసులకు విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా యువజనోత్సవాలు



పోటీల్లో పాల్గొన్న వారితో అధికారులు

కర్నూలు(హాస్పిటల్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజన సర్వీసులశాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో స్థానిక రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో యువజనోత్సవాల పోటీలు నిర్వహించారు. వక్తృత్వం, పోస్టర్ మేకింగ్, దేశభక్తి గీతం, ఫ్యాన్సీ డ్రస్ అంశాలలో ఈ పోటీలు జరిపారు. సెట్కూరు సీఈఓ టి.వి.రమణ మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు ఈనెల 12న నిర్వహించే స్వామి వివేకానంద జయంతి సభలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సెట్కూరు మేనేజర్ జి.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి అహల్య పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని డీవీఈఓ జమీర్ పాష అన్నారు. మంగళవారం బీక్యాంప్‌లోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల 16వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవీఈఓ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులను అభ్యసించిన విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఉన్నత ఆశయాలను లక్ష్యంగా పెట్టుకొని అందుకు శ్రమించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, విశ్రాంత ప్రిన్సిపాల్ కొట్టె చెన్నయ్య, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు హుసేన్ పీర, పార్వతి, రాఘేంద్ర అధ్యాపకులు ప్రసన్న, వాణి రామకృష్ణ, విజయ శేఖర్, గిరిజారాణి, లక్ష్మి, సుజాత, లావణ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నాణ్యతలో రాజీ పడొద్దు

- ఆర్థిక అంశాలు, క్షేత్ర స్థాయి ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్‌పర్సన్, పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి




సమావేశంలో మాట్లాడుతున్న వి.కళావతి, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్‌పర్సన్, పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అధికారులకు సూచించారు. ఆర్థిక పరమైన అంశాలు, క్షేత్ర స్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ పీఆర్, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం తదితర శాఖల్లో చేసిన ఖర్చులపై సమీక్షించారు. ఆర్థిక అంచనాలకు తగినట్లుగా పనులు జరుగుతన్నాయా, లేదా, క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపుల తరువాత కాంట్రాక్టర్లు జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి రోడ్ల నిర్మాణాల్లో గ్రామాల పేర్లు ఉండేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డులో మార్కింగ్‌లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అన్ని పనులను ప్యాకేజ్ కాంట్రాక్టర్‌గా ఇవ్వకుండా విడివిడిగా పనులు కేటాయిస్తే త్వరగా జరుగుతాయన్నారు. పీఎంజీఎస్‌వై రోడ్లలాగా ఇతర రోడ్లను కూడా ఐదేళ్లపాటు కాంట్రాక్టర్లే మెయింటెనెన్స్ చేసేలా చర్యలు తీసుకోవాలని పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం సూచించగా.. ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గ్రామీణ నీటి సరఫరా సమీక్షలో భాగంగా జల్ జీవన్ మిషన్ కింద గ్రామాల్లో పైప్‌లైన్ వేసేటప్పుడు ప్రజల సలహాలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కొన్ని చోట్ల పైప్‌లైన్ కోసం వినియోగించే పైపులు చిన్నవిగా ఉన్నాయని, నీరు ఫోర్సుగా వస్తే పైపులకు తట్టుకునే శక్తి ఉండదన్నారు. ముందే మంచి గేజ్ ఉన్న పైపులను వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు రాత్రిళ్లు మాత్రమే వెలిగేలా చూసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరే విధంగా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీఓ నాగరాజునాయుడు క్షేత్ర స్థాయిలో చేపడుతున్న పనుల వివరాలు, ఏర్పడుతున్న ఇబ్బందులను ఛైర్‌పర్సన్ దృష్టికితెచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ సెక్రటరీ భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పోతన్నకు తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పోతన్న

కర్నూలు కల్చరల్: జిల్లా జానపద సాహితీ వేత్త డాక్టర్ వి.పోతన్నను 'తెలుగు భాషా సేవ ప్రతిభా పురస్కారం' అందుకున్నారు. తెలుగు భాషా వికాసానికి చేస్తున్న సేవకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ మంగళవారం అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన అనంత తెలుగు భాషా వైభవ సదస్సు కార్యక్రమంలో పోతన్న పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు, తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు పి.విజయ బాబు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

మానవ అక్రమ రవాణా పెద్ద నేరం

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటనాగశ్రీనివాసరావు

కర్నూలు: మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరాల్లో ఒకటని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కోర్టులోని లోక్ అదాలత్ ప్రాంగణంలో మంగళవారం ఆపరేషన్ స్వేచ్ఛ–2024 పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా వ్యతిరేకతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరి సాయం అవసరమన్నారు. అక్రమ రవాణా నిర్వహిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 19, 20, 21, 23, 23(1), 39, 39ఎ, 42, 43, 45, 47 ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్స్ 339 నుంచి 342, 359 నుంచి 377, జువైనల్ జస్టిస్ యాక్ట్ నుంచి సెక్షన్ 23, 24, 25, మరికొన్ని చట్టాలు వీటిని అరికట్టేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. దిశ పీఎస్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు వెట్టి చాకిరీ నిర్మూలనకు న్యాయ, పోలీసు, రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, లేబర్, మెడికల్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ లైన్ శాఖల సమన్వయంతో 2024 ఆపరేషన్ స్వేచ్ఛ అవగాహన కార్యక్రమం పేరుతో ఈనెల 11 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

నగరంలో రెండు బృందాలు తనిఖీ..

నాగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో కర్నూలు నగరంలో రెండు బృందాలుగా వెళ్లి కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, రాజ్‌విహార్, చెన్నమ్మ సర్కిల్, ఆటోనగర్, వడ్డెగేరి, జిల్లాపరిషత్, ఓల్డ్ కంట్రోల్ రూమ్, బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లో వీధి బాలలను గుర్తించడానికి తనిఖీ నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో ఏడుగురు వీధి బాలలను గుర్తించి జిల్లా బాలల సంక్షేమ సమితి ముందు కౌన్సిలింగ్ చేసి వారి కుటుంబ సభ్యులను గుర్తించి అప్పగించారు. బాలలు విద్యను అభ్యసించడం కోసం సహాయం చేశారు. కార్యక్రమంలో దిశ పోలీస్‌స్టేషన్ సీఐ కళా వెంకటరమణ, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ హరినాథ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్, ఆశా వర్కర్లు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: ఆదోని– ఇస్వీ రైల్వే లైన్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కిలోమీటర్ నంబర్ 495/12–14 వద్ద గుర్తు తెలియన వ్యక్తి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికుల నుంచి వచ్చిన సమాచారంతో రైల్వే ఎస్ఐ కే.గోపాల్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటుందని, తల ఛిద్రం కావడంతో గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహం ఉందని ఎస్ఐ తెలిపారు. షర్ట్ కాలర్‌పై లైఫ్ స్టయిల్ టైలర్ జీటీఎల్ అని ఉందని, మృతదేహం వద్ద అనారోగ్యానికి సంబంధించిన మాత్రలు లభించాయన్నారు. ఎవరికైనా మృతుడి సమాచారం తెలిస్తే తమను తెలియాజేయాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు లారీలు సీజ్

కర్నూలు (న్యూటౌన్): బేతంచెర్ల నుంచి మహారాష్ట్రకు నాపరాయిని అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి, రూ.96వేలు జరిమానా విధించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. నాపరాయి తరలుతోందని వచ్చిన సమాచారం మేరకు మంగళవారం మైనింగ్ అధికారులు సోదాలు చేశారు. కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏపీ 39 యూఎఫ్ 2788, కేఏ 40బీ 2439 లారీలను ఆపి తనిఖీ చేయగా నాపరాయి ఉన్నట్లు గుర్తించారు. లారీలను సీజ్ చేసి, జరిమానా వసూలు చేశారు. తనిఖీల్లో మైనింగ్ విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దొంగ అరెస్టు



ద్విచక్ర వాహనం దొంగ పవన్‌కుమార్

కర్నూలు : కర్నూలు రాజ్‌విహార్ బస్టాప్ వద్ద పార్కు చేసి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న బుధవారపేటకు చెందిన పవన్‌కుమార్‌ను రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పాతబస్తీలో నివాసముంటున్న అజీజ్ సఫా కాలేజీలో చదువుతున్నాడు. ఈనెల 6వ తేదీన తన ద్విచక్ర వాహనాన్ని రాజ్‌విహార్ బస్టాప్ వద్ద పార్కు చేసి కాలేజీకి వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చేసరికి స్కూటీ కనిపించలేదు. దీంతో అజీజ్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్రైం పార్టీ పోలీసులు రవి, మహేంద్ర, శ్రీనుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా దొంగను గుర్తించి ఫోన్ లొకేషన్ ద్వారా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సోమవారం సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ కళాశాల వద్ద చోరీ చేసిన ద్విచక్ర వాహనాన్ని విక్రయించేందుకు వేచి ఉన్నట్లు ఫోన్ లోకేషన్ ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఇతను గతంలో గొర్రెల దొంగతనం కేసులో, వెంకటరమణ కాలనీలో బేకరీలో దొంగతనం కేసులోనూ నిందితుడుగా ఉన్నట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు రెండో పట్టణ ఏఎస్ఐ గౌస్‌పీరా తెలిపారు.

రేషన్ పంపిణీని వేగవంతం చేయండి



జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ

నంద్యాల: రానున్న సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ వేగవంతం చేయాలని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, అసైన్డ్ భూముల విచారణ తదితర అంశాలపై మండల తహసీల్దార్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జగనన్న భూహక్కు – భూ రక్ష పథకం కింద రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం రీ సర్వే జరుగుతున్న 15 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ ఈనెల 12వ తేదీ లోపు పూర్తి కావాలని ఆదేశించారు. వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్‌లలో ఉన్న ఇనాం భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి పనుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రేషన్ పంపిణీపై డిప్యూటీ తతహసీల్దార్లు తనిఖీలు నిర్వహించి సంక్రాంతి లోపు కార్డుదారులకు సరుకులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటరాముడు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకే జగనన్న ఆరోగ్య సురక్ష



శిబిరానికి వచ్చిన వ్యక్తితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రజల ఆరోగ్య సంరక్షణకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన నగర శివారులోని బి.తాండ్రపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, కేస్‌షీట్లు, ల్యాబ్ టెస్టులు, మెడికల్ ఆఫీసర్ల కౌంటర్లు, మందులు ఇచ్చే కౌంటర్లు పరిశీలించారు. రోగులను అవసరం మేరకు ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారి కేస్‌షీట్, మందుల గురించి తెలుసుకున్నారు. వారికి జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగ్‌లను అందజేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

- సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోనిరూరల్: పేద ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సబ్‌కలెక్టర్ శివనారాయణస్వామి వైద్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రులను ఆయన మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రోగుల ఓపీ రికార్డులు, ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. వార్డులో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి ఆరోగ్య స్థితిగతులు, సమయానికి వైద్యం అందిస్తున్నారా? లేదా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు తాగునీరు సౌకర్యం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే ఆస్పత్రిలో తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఫోన్ ద్వారా ఏపీఎంఎస్ఐడీసీ ఈఈని ఆదేశించారు. ఏరియా ఆస్పత్రిలో కారిడార్‌లో రోగులకు అక్కడే బెడ్స్ ఏర్పాటు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న గదులను త్వరితగతిన పూర్తి చేసి రోగులకు మంచి వైద్యాన్ని అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, మాతాశిశు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత, అధికారులు ఉన్నారు.

క్రీడలతో ఆరోగ్య భాగ్యం

- ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ బీఎస్ఎస్ మూర్తి



మాట్లాడుతున్న ఎఫ్‌డీ బీఎస్ఎస్ మూర్తి



కబడ్డీ ఆడుతున్న ఫారెస్టు అధికారులు

నంద్యాల(సిటీ): తరచూ క్రీడల్లో పాల్గొనడంతో మానసిక ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని అటవీ సంరక్షణాధికారి, నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్ (కన్జర్వేటర్) బీఎస్ఎస్ మూర్తి అన్నారు. మంగళవారం ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ పాఠశాల మైదానంలో ఫారెస్టు అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించే స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ బీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ నిత్యం అడవిలో ఉంటూ వన్యప్రాణులను కాపాడుతూ, అడవులను సంరక్షిస్తున్న ఫారెస్టు అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పాటు నంద్యాలలో క్రీడలు నిర్వహించడం హర్షణీయమన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంలో ఎన్నో వన్యప్రాణులతో నిండి అటవీ సంపదలో దేశంలో అత్యంత ప్రత్యేక కలిగిన ప్రాంతాన్ని పరిరక్షించడంలో ఫారెస్టు అధికారులు సిబ్బంది ప్రత్యేక చొరవ చూపిస్తున్నారన్నారు. నంద్యాల జిల్లా అయిన తర్వాత మొదటిసారిగా నిర్వహించిన క్రీడలకు నంద్యాల, ఆత్మకూరు, మార్కాపురం, గిద్దలూరు డివిజన్లకు సంబంధించిన 150కి పైగా క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, జావెలిన్‌త్రో, పరుగుపందెం, షాట్‌పుట్, జావెలిన్‌త్రో తదితర క్రీడలలో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డీడీ (డిప్యూటీ డైరెక్టర్) అనురాగ్ మీన (ఐఎఫ్ఎస్), ఆత్మకూరు డీడీ అలాంగ్ ఛాంగ్ (ఐఎఫ్ఎస్), మార్కాపురం డీడీ విగ్నేష్ అప్పవ్(ఐఎఫ్ఎస్), గిద్దలూరు డీడీ వెంకట నరసింహులు, ఇతర సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

గాలికుంటు.. టీకాతో తరిమికొట్టు

- నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా అవసరం
- నంద్యాల జిల్లాలో 3.72 లక్షల డోసులు
- నెలాఖరులోపు వ్యాక్సినేషన్ పూర్తికి చర్యలు



గాలికుంటు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

గోస్పాడు: జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమే రైతులకు జీవనాధారం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబంలో తప్పనిసరిగా పాడి పశువుల పోషణతో లబ్ధి పొందుతున్నారు. పశువులకు ఈ సీజన్‌లో గాలికుంటు వ్యాధి వైరస్ వ్యాపించే అవకాశాలు ఉండటంతో రైతులను ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. పశువుల సంరక్షణే లక్ష్యంగా పశు సంవర్ధక శాఖ ద్వారా గాలికుంటు వ్యాధి టీకాలను ఉచితంగా సరఫరా చేస్తుంది. దీంతో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ప్రతి రైతుకు తమకు సంబంధించి నాలుగు నెలలు దాటిన పశువులు, ఆవులు, ఎద్దులకు టీకాలు వేసేలా చర్యలు చేపట్టింది. గ్రామ గ్రామాన పశువైద్య సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి గాలికుంటు టీకాలు వేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి గోవిందనాయక్ తెలిపారు.

నంద్యాల జిల్లాలో 2.90 లక్షలు గేదెలు, 1.20 లక్షలు ఆవులు, ఎద్దులు ఉన్నాయి. వీటికి సంబంధించిన జిల్లాలో 3.73 లక్షల డోసులు వేసేలా లక్ష్యంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు.

వ్యాధి లక్షణాలు...

- గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు గాలి కుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువ ఉంటుది. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో వేడి అధికమై వాటికి జ్వరం సోకి షూలు పశువుల్లో గర్భం విఫలమయ్యే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన పశువులు, ఆవుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. అలాగే నోరు, మూతి, కాళ్ల గిట్టలో పుండ్లు రావడం జరుగుతుంది. నోటి నుంచి విపరీతంగా నురగ రావడం కనిపిస్తుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్ హీట్ వరకు పెరిగి పశువులు నీరసిస్తాయి.
- ఎద్దులకయితే పని చేసే సామర్థ్యం తగ్గిపోతుంది. నోటిలోపల పైపొర, పళ్లు, చిగుళ్లు, నాలుక, లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడుతుంది. దీంతో పశువులు, ఆవులు, గేదెలు మేత తినకుండా నోటి నుంచి చొంగ కారుతుంది. దీంతో అవి నీరశించి పోయే అవకాశం ఉంటుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవించే అవకాశం కూడా ఉంటుంది. పొదుగుపై బొబ్బలు ఏర్పడుతుంది. దీంతోపాటు పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ ఎండ వేడికి తట్టుకో లేక నీరసిస్తాయి.

వ్యాధి వ్యాప్తి చెందే విధానం..

పశువుల లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి వల్ల వ్యాధి మిగతా పశువులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఒక చోటి నుంచి మరో చోటకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఫలితంగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుంది.

ముందు జాగ్రత్తలతో సంరక్షణ



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలోని ఇంటి వద్దకే పశువైద్యాధికారులు వచ్చి పశువులకు సంబంధించిన టీకాలను ముందుగానే అందజేస్తున్నారు. దీంతో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తమలాంటి వారికి పాడి పశువుల పోషణ మరింత లాభసాటిగా మారుతుంది. ఇలాంటి ముందు జాగ్రత్త చర్యలతో పశువులను సంరక్షించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– తాడి వెంకటరెడ్డి, నెహ్రూనగర్, రైతు

నివారణ చర్యలే మార్గంగా



పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్‌ను రక్తంలోకి ఎక్కించాలి. నోటిలో పుండ్ల వల్ల మేత సరిగా మేయవు. కాబట్టి వారికి శక్తి నిచ్చి సులభంగా అరిగే పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. కాలి గిట్టల మధ్య పండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకాలతో కడిగి వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి పూయాలి. వైద్యులను సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

– కిశోర్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి, నెహ్రూనగర్, గోస్పాడు